క్లుప్తంగా

కుప్పిలి కవితకు ప్రశంస



ఆమదాలవలస: హైదరాబాద్‌కు చెందిన ఉస్మానియా తెలుగు రచయితల సంఘం నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీల్లో ఆమదాలవలసకు చెందిన కవి కుప్పిలి వెంకట రాజారావు మాస్టార్‌కు ప్రశంసాపత్రం లభించిందని బుధవారం ఆయన తెలిపారు. ఉగాది సందర్భంగా నిర్వహించిన కవితల పోటీల్లో రాజారావు రచించిన 'ఎరుపెక్కిన గొంతు' కవితకు ఈ ప్రశంసాపత్రం అందిందన్నారు. దీనికి సంబంధించిన ధ్రువపత్రం అందిందన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా మోహన్‌రావు



కొత్తూరు: మండలం నాయీబ్రాహ్మణ సంఘం ఎన్నిక బుధవారం కొత్తూరులో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా టి.మోహన్‌రావు, ఉపాధ్యక్షుడిగా ఎస్.సంజీవరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో పది మంది సభ్యులను ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు మోహన్‌రావు చెప్పారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ మండలంలోని నాయీబ్రాహ్మణ కుటుంబాలతోపాటు పలు సామాజిక వర్గాలకు చెందిన పేద కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు.

తాగునీటి సమస్యకు సత్వర పరిష్కారం

ఆమదాలవలస రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో వేసవికాలం దృష్ట్యా ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే వెంటనే స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి ఫిర్యాదు చేస్తే సత్వరమే పరిష్కరిస్తామని ఎంపీడీఓ ఎం.రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ఉన్న తాగునీటి బోర్లు ఎక్కడైనా మరమ్మతులకు గురైతే వెంటనే తెలియజేయాలని సూచించారు. తాగునీటి సమస్యను తెలియజేయడానికి మండల కార్యాలయంలో ప్రత్యేక ఫిర్యాదుల విభాగాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఎక్కడ బోరు మరమ్మతులకు గురైనా 7013743641, 8096505108 నంబర్లకు ఫిర్యాదు చేస్తే 24 గంటల్లోగా పరిష్కరిస్తామని తెలియజేశారు.

మంచినీటి బోరు ప్రారంభం



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న ఉప సర్పంచ్ అప్పలనాయుడు

ఆమదాలవలస రూరల్: గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేస్తే మరింతగా అభివృద్ధి చెందుతుందని కొత్తవలస ఉప సర్పంచ్ గురుగుబెల్లి అప్పలనాయుడు అన్నారు. అప్పలనాయుడు తన తల్లిదండ్రులు జ్ఞాపకార్థం కొత్తవలస గ్రామ పెద్దవీధి సమీపంలో మంచినీటి బోరును ఏర్పాటు చేసి బుధవారం ప్రారంభించారు. గ్రామ ప్రజల కోరిక మేరకు తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు ఈ బోరు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఉగాది పర్వదినం రోజున ప్రజలకు ఈ తాగునీటి బోరును అందుబాటులోకి తీసుకురావడం ఆనందగా ఉందన్నారు. గ్రామాభివృద్ధికి తనవంతు ఎల్లప్పుడూ కృషి చేస్తానన్నారు. గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

నరసన్నపేట: విశ్వబ్రాహ్మణ సంఘంలో ఉన్న పేద కుటుంబాలకు వస్త్రాలను బుధవారం పంపిణీ చేశారు. విశ్వబ్రాహ్మణ ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దుస్తులు అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.వేణుగోపాలరావు, నరసన్నపేట సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడేలా ఉపాధి పనులు



గుర్రపుడెక్క తొలగింపు పనులు పరిశీలిస్తున్న ఏపీఓ శ్రీదేవి

ఎల్.ఎన్.పేట: రైతులకు ఉపయోగపడేలా ఉపాధి హామీ పథకం పనులు చేపట్టాలని ఆ పథకం ఏపీఓ వి.శ్రీదేవి అన్నారు. మండలంలోని ధనుకువాడ పంచాయతీలో ఏబీ రోడ్డు పక్కనుంచి పెద్దచెరువుకు వెళ్లే సాగునీటి కాలువలో గుర్రపుడెక్క తొలగింపు పనులు ఆమె బుధవారం పరిశీలించారు. కాలువలో సాగునీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేస్తామన్నారు.

'శోభకృత్'కు స్వాగతం

శోభకృత్ నామ తెలుగు సంవత్సరానికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. పల్లెలు, పట్టణాల్లో ఉగాది సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రైతులు, అన్ని వర్గాల ప్రజలు ఉగాది సంబరాలు సందడిగా చేపట్టారు. ఉదయాన్నే స్నానాలు ఆచరించి ఇంటి వద్ద ధాన్యం రాశిపై బియ్యం వేసి వాటిలో పసుపు కొమ్ములతో ఏరువాక పూజలు జరిపారు. అనంతరం పంట పొలాలు, కళ్లాల్లో ఏరువాక (ఏరుపూత) పూర్తి చేసి భూమికి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సభ్యులందరూ కలిసి ఉగాది పచ్చడి స్వీకరించారు. ఉగాది రోజున ఎడ్ల బండిలో ప్రయాణాలు చేశారు. కొనుగోలుదారులతో బంగారు దుకాణాలు కిటకిటలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో పురోహితులు పంచాగ పఠనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



పొందూరు: రాపాకలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు



ఆమదాలవలస: భవిత పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు



సరుబుజ్జిలి: రొట్టవలసలో పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న మావుదూరి హరిరామకృష్ణశర్మ, గ్రామస్తులు



ఎల్.ఎన్.పేట: దబ్బపాడులో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో పాల్గొన్న రైతులు



ఆమదాలవలస: వేదగాయిత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న వేదపండితులు రామాచార్యులు, రాజేష్‌శర్మ



జలుమూరు: శ్రీముఖలింగంలో పంచాంగ పఠనం నిర్వహిస్తున్న అర్చకులు



ఆమదాలవలస రూరల్: వెదుళ్లవలసలో ఆసిరతల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న గ్రామస్తులు



నరసన్నపేట: లక్ష్మీ టాకీస్ వద్ద ఉన్న రామాలయంలో ఉగాది పూజలు



సారవకోట: మండల కేంద్రంలోని శివాలయ ఆవరణలో పంచాంగ పఠనం చేస్తున్న పండితులు



పాతపట్నం: నీలమణిదుర్గ ఆలయం వద్ద పంచంగ పఠనంలో ఆలయ ధర్మకర్తలు



పాతపట్నం: నీలమణిదుర్గ అమ్మవారి ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు



కొత్తూరు: మెట్టూరు బిట్-1 ఆర్‌ఆర్ కాలనీలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న దృశ్యం



హిరమండలం: మండల కేంద్రంలో పంచాంగ పఠనం చేస్తున్న పురోహితులు



పాతపట్నం: నీలమణిదుర్గ ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

ఆకట్టుకున్న మహాగళార్చన



కోలాటమాడుతున్న చిన్నారులు



మహాగళార్చనలో పాల్గొన్న భజగోవిందం సభ్యులు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరాలయంలో ఉగాది సందర్భంగా భజగోవిందం సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన గోవింద నామాల మహాగళార్చన ఆకట్టుకుంది. వందలాది మంది భజగోవిందం సభ్యులు పాల్గొని సామూహికంగా గోవింద నామాలు పలికారు. గంట కాలం కొనసాగిన గోవిందనామాల గళార్చనతో ఆలయం ప్రాంగణం మార్మోగింది. అనంతరం జోష్యుల సుందర వేణుగోపాలశర్మ పంచాంగ శ్రావణం నిర్వహించారు. భజగోవిందం సేవా సమితి సభ్యులు గొండు స్వామిబాబు, శిమ్మ లక్ష్మణరావు, గుంటక శ్రీధరరావు, ఉప్పాడ వెంకటరావు, సంతోషి తదితరులు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మీనరసింహా భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. రామావతారంలో వేంకటేశ్వర స్వామి దర్శనం ఇచ్చారు.

గిరిజనులు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న హేమలత

సారవకోట: తమ హక్కుల సాధనకు గిరిజనులందరూ సంఘటితం కావాలని గిరిజన ఐక్యవేదిక జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎస్.హేమలత అన్నారు. మండల కేంద్రంలో గిరిజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులు ఆర్థిక, సామాజికాభివృద్ధి సాధించేందుకు కలిసి పోరాటం చేయాలన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం ట్రైకార్ రుణాలు మంజూరు చేయడం లేదని, వాటిని మంజూరు చేయాలన్నారు. గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి గుజ్జువాడ సోమేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణ, జన్ని రామారావు, బెల్లికొల దండాశి, మెండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

హిరమండలం: స్థానిక కోదండరామాలయలంలో శ్రీరామనవమి ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి ఆలయలంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది నుంచి ఈ నెల 30 వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 30న సీతారాముల కల్యాణం మహోత్సవం నిర్వహిస్తామన్నారు. అదేరోజు అన్నసమారాధన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

అలరించిన హరేరామ నామ సంకీర్తన



హరేరామ నామ సంకీర్తన చేస్తున్న భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో హరేరామ నామ సంకీర్తన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో 24 గంటల పాటు హరేరామ, హరేకృష్ణ నామ సంకీర్తన నిర్వహించామని కమిటీ సభ్యులు తెలిపారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భజన మండల సభ్యులు, భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తేజేశ్వరరావు

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు పాతపట్నం నియోజకవర్గం నాయకుడు, విద్యావేత్త సిరిపురం తేజేశ్వరరావు బుధవారం తెలిపారు. మండల కేంద్రానికి అనేక అవసరాల కోసం వచ్చిన ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు వేసవి కాలం అంతా చలివేంద్రం కొనసాగిస్తామన్నారు. చలివేంద్రం వద్ద ప్రతీరోజు ఒక వ్యక్తి ఉంటారన్నారు.

భారీ వర్షం



కొత్తూరులో రహదారిపై ప్రవహిస్తున్న వర్షం నీరు



పాతపట్నంలో కురుస్తున్న వర్షం

కొత్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో మండలంలో పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఐదు నుంచి ఏడు గంట వరకు భారీ వర్షం కురిసింది. నాలుగు రోడ్ల కూడలి వర్షం నీటితో నిండిపోయింది. కొంత సమయం వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు టమాటా, నువ్వు పంటలతోపాటు పలు రకాల పంటలకు నష్టం జరగడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

పాతపట్నం: మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలు, పిడుగులతో కూడిన భారీ వర్షం గంట సమయం కురిసింది. అచ్చుతాపురం, ప్రహరాజపాలెం, కొదూరు, గోపాలపురం, బూరగాం, కొరసవాడ, సీది, రొంపివలస, గంగువాడ తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.

రహదారి నిర్మాణ పనులు ప్రారంభం



రహదారి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ శంకర్

నరసన్నపేట: జాతీయ రహదారికి ఆనుకుని కల్యాణి డాబా ఎదురుగా ఉన్న శ్మశానానికి రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేస్తున్నామని సర్పంచ్ బూరల్లి శంకర్ తెలిపారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపడుతున్న ఈ పనులను బుధవారం ప్రారంభించారు. పెద్దపేట, జగన్నాథపురం, మారుతీనగర్ నెయ్యిల, కిలిగి, బండివీధి, సౌభాగ్యలక్ష్మీనగర్, శ్రీరామనగర్‌లకు చెందిన శ్మశానానికి సరైన రోడ్డు లేక వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆదేశాల మేరకు ఈ రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. పంచాయతీ వార్డు సభ్యులు పి.కృష్ణప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాగోటి రాజారావు, ముద్దాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

బోన్ క్యాన్సర్ చిన్నారికి ఆర్థికసాయం

పాతపట్నం:

మండలంలోని పెద్దలోగిడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థిని దేవిక బోన్ క్యాన్సర్‌తో బాధపడుతుంది. ఆమెకు పాతపట్నం సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి దేవికకు రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



దేవికకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం